నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్, బుధవారం 30 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL

## మెస్సేజ్ యువర్ ఎస్పీకి..

# స్పందన బాగుంది

### ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచుతున్నం

- సామాన్యులు ధైర్యంగా ముందుకొస్తున్నారు
- ఏదైనా సమస్య ఉంటే 87126 59973 మొబైల్ నంబర్‌కు మెస్సేజ్ చేయండి
- 'నమస్తే' ఇంటర్వ్యూలో ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



'నమస్తే'తో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

*'ఏప్రిల్ 9వ తేదీన శ్రీకారం చుట్టిన 'మెస్సేజ్ యువర్ ఎస్పీ'కి స్పందన చాలా బాగుంది. వేగంగా న్యాయం జరుగుతుండడంతో విశేష స్పందన లభిస్తున్నది. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచడంతో సామాన్యులు ధైర్యంగా ముందుకొస్తున్నారు. గతంలో గ్రామాలు, పట్టణాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నప్పుడు మనకెందుకులే ఎవరికి వారే మౌనంగా ఉండేవారు. ఫిర్యాదు చేస్తే అవతలి వారికి పగదారులం అవుతామని భావించేవారు. కానీ.. 'మెస్సేజ్ యువర్ ఎస్పీ' కార్యక్రమాన్ని ప్రారంభించిన తర్వాత సామాన్యులు ముందుకొచ్చి ఫిర్యాదు చేయడం సంతోషంగా ఉంది.' అని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ 'నమస్తే' ఇంటర్వ్యూలో తెలిపారు.* - ఎదులాపురం, ఏప్రిల్ 29

నమస్తే ఇంటర్వ్యూ INTERVIEW

**నమస్తే : 'మెస్సేజ్ యువర్ ఎస్పీ' ఆలోచన ఎలా వచ్చింది?**

**ఎస్పీ అఖిల్ మహాజన్ :** మహిళలు, ఆడపిల్లలు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయాలంటే భయపడడం సహజం. అయితే వాళ్లు స్టేషన్‌కు రాకున్నా పోలీసుల తరపున వారి కోసం ఒక మొబైల్ నంబర్ ఏర్పాటు చేశాం. మారుముల గ్రామాలకు చెందిన వారికి సేవలు అందాలనే సంకల్పంతో ప్రారంభించాం. గతంలో పని చేసిన జిల్లాల్లో అమలు చేశా. అక్కడ మంచి ఫలితాలు వచ్చాయి. అదేవిధంగా ఆదిలాబాద్ జిల్లాలో కూడా ఏప్రిల్ 9వ తేదీన ప్రారంభించా.

**నమస్తే : ఏఏ విషయాల్లో ఫిర్యాదు చేయవచ్చు?**

**ఎస్పీ :** ఆపదలో ఉన్నవారితోపాటు, మన చుట్టు పక్కల అసాంఘిక కార్యకలాపాలు, వేధింపులు, భార్యాభర్తల మధ్య గొడవ, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియాలో ఇబ్బందులు పెట్టిన, చిన్న, పెద్ద తేడా లేకుండా మెస్సేజ్ యువర్ ఎస్పీకి మెస్సేజ్ లేదా వాయిస్ రూపంలో ఫిర్యాదు చేయవచ్చు.

**నమస్తే : ఎంత సమయంలో సమస్యలను పరిష్కారం చేస్తున్నారు?**

**ఎస్పీ :** 'మెస్సేజ్ యువర్ ఎస్పీ'కి ఫిర్యాదు వచ్చిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇస్తున్నాం. ఆ తరువాతే బాధితులకు న్యాయం చేస్తాం. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతున్నం. వాట్సాప్ నంబర్‌ను నేనే పరిశీలిస్తూ ఉంటా.

**నమస్తే : ఎన్ని మెస్సేజ్‌లు వచ్చాయి?**

**ఎస్పీ :** ఈనెల 9వ తేదీన కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఇప్పటికీ 21రోజులు అవుతున్నది. 255 మెస్సేజ్‌లు వచ్చాయి. వీటిలో ఇప్పటి వరకు 60 శాతం పరిష్కరించాం. మిగిలిన 40 శాతంలో కొన్ని తప్పుడు, ఒకరిపై ఒకరు వ్యక్తిగత కక్షలతో ఫిర్యాదు చేశారని తేలింది. మెస్సేజ్ సరైన సమాచారం ఉంటే సమస్యలు పరిష్కారం అవుతాయి.

**నమస్తే : కార్యక్రమం ఎప్పటి వరకు అమలులో ఉంటుంది?**

**ఎస్పీ :** నేను జిల్లా నుంచి బదిలీ అయ్యే వరకు అమలులో ఉంటుంది. నేరుగా ఫిర్యాదు చేయలేనివారు, సుదూర ప్రాంతాల్లో ఉన్నవారు, పట్టణంలో ఎవరైనా సరే వాట్సాప్ మెస్సేజ్ రూపంలో 87126 59973 మొబైల్ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. సమాచారం ఇచ్చిన వారికి జిల్లా పోలీసులు అండగా ఉంటారు.

**నమస్తే : జిల్లావాసులకు మీరు ఏమి చెబుతారు?**

**ఎస్పీ :** ఇబ్బందులు, భయం ఉన్నా, ముఖ్యంగా పోలీస్ శాఖ, ఇతర శాఖలకు సంబంధించిన వారిపైన వాట్సాప్ రూపంలో ఫిర్యాదు చేయవచ్చు. తప్పు చేసిన వారైనా సరే విడిచి పెట్టేది లేదు. కచ్చితంగా కేసు నమోదు చేస్తాం. బాధితులకు న్యాయం చేసి అండగా ఉంటాం.



# దొంగలున్నారు జాగ్రత్త

## నిర్మల్ జిల్లాలో దొంగల బీభత్సం

- ఒంటరి, ఎవరూలేని ఇండ్లే టార్గెట్ ● ఆలయాలనూ వదలని దుండగులు ● నడి రోడ్డుపైనే నగలు, డబ్బులు లాక్కెళ్లున్న దొంగలు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 29 : నిర్మల్ జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఒంటరి వ్యక్తులు, మహిళలు, తాళం వేసిన, శివారు ప్రాంతాల ఇండ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఆరు నెలల నుంచి నిత్యం ఏదో ఒక చోట దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. జిల్లా కేంద్రంలోనే నడి రోడ్డుపైనే మహిళల మెడలో నుంచి పుస్తెల తాళ్లు, బంగారు ఆభరణాలను దుండగులు లాక్కెళ్తున్నారు. ఒకటి, రెండు ఇండ్లలో వరుస చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్, నగదు లాక్కెళ్లడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పెట్రోలింగ్, నిఘాను పోలీసులు పటిష్టం చేసినట్లయితే దొంగతనాలకు అడ్డుకట్ట పడే అవకాశాలు ఉన్నాయి.

### హడలెత్తుతున్న జనం

నిర్మల్ జిల్లా కేంద్రంలోని గాజుల్‌పేట్ కాలనీలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో గత మంగళవారం ఒకేసారి రెండు ఇండ్లలోకి దొంగలు చొరబడి నగదు, నగలు అపహరించుకు పోయారు. కాలనీకి చెందిన షేక్ సాబీర్ ఇంట్లో ఎవరూ లేనిది చూసి రూ.20 వేలు, మూడు తులాల బంగారం దోచుకెళ్లారు. అతని ఇంటి పక్కనే గల అన్వర్ ఇంట్లోకి చొరబడి బీరువాలోని రూ.6 వేలు, రెండు బంగారు రింగ్‌లను ఎత్తుకెళ్లారు.

కడెం మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన పడాల గంగవ్వ ఇంట్లో రాత్రి దొంగతనానికి పాల్పడ్డారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మూడు తులాల బంగారం,10 తులాల వెండి, రూ.1.50 లక్షల నగదును దోచుకెళ్లారు. నిర్మల్ పట్టణంతోపాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ఓ మూడు వైన్సుల షట్టర్లను పగులగొట్టి మద్యం, నగదును అపహరించుకుని పోయారు. జనవరి 30న



ఇంటి తలుపు పగులగొట్టి బీరువాలోని వస్తువులను చిందర వందర చేసిన దొంగలు

నిర్మల్ జిల్లా కేంద్రంలో సినీ ఫక్కీలో దొంగతనం జరిగింది. లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్ గ్రామానికి నరేశ్ డబ్బుల నిమిత్తం మయూరి హోటల్ వద్ద గల యూనియన్ బ్యాంకుకు వచ్చాడు. బ్యాంకు నుంచి రూ. 5 లక్షలు డ్రా చేసి బైక్ బాక్స్‌లో పెట్టి ఫోన్ మాట్లాడుతుండగా దుండగుడు డబ్బును దోచుకెళ్లారు.

### రద్దీ ప్రదేశాలే టార్గెట్

దొంగలు తమ పనులను సులువుగా కానిచ్చేందుకు రద్దీ ప్రదేశాలను ఎంచుకుంటున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా అదును చూసుకుంటూ తమ పనిని కానిచ్చేస్తున్నారు. బస్టాండ్లు, షాపింగ్ మాల్స్, మార్కెట్ ఏరియాలు, తాళం వేసిన ఇండ్లు, వృద్ధులను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పతున్నారు. నిర్మల్ పట్టణంలోని మయూరి హోటల్ ముందర మహిళ ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును అపహరించుకుని పోయారు. జనవరి 15వ తేదీన స్థానిక శివాజీ చౌక్‌లో జంగయ్య రూ.50 వేల నగదుతో నడుచుకేంటూ వెళ్తుండగా దోచుకెళ్లారు. దొంగలు ఇండ్లతోపాటు ఆలయాలను వదలడం లేదు. అందిన కాడికి దోచుకుని వెళ్లడమే లక్ష్యంగా తమ పని కానిస్తున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని శాంతినగర్ భక్త హనుమాన్ ఆలయంలో దొంగతనం చోటు చేసుకుంది. ఆలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినప్పటికీ దొంగతనాన్ని మాత్రం వదలలేదు. సీసీ కెమెరాల వైర్లను కత్తిరించి కెమెరాలను పైకి తిప్పి ఆలయం తాళం పగులగొట్టి, హుండీలోని నగదును దోచుకెళ్లారు.

### దొంగనోట్ల కలకలం

జిల్లాలో ఎక్కడో ఒకచోట గొలుసు దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. గతంలో జిల్లా కేంద్రంలోనే పట్ట పగలే పలు గొలుసు దొంగతనాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. ఒంటరిగా వెళ్లే మహిళలు, వృద్ధులు, నిర్మానుష్య ప్రదేశాల్లో తిరిగే ప్రజలను టార్గెట్ చేస్తూ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. బైక్‌లపై వచ్చి మహిళల మెడలో నుంచి బంగారు గొలుసులు లాక్కెళ్లే క్రమంలో నగలు పోవడంతోపాటు మహిళలకు గాయాలు అవుతున్నాయి. ఇదిలా ఉండగా నిరక్ష్యరాస్యులైన కూరగాయల వ్యాపారులకు దొంగనోట్లు అంటగడుతూ తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. రెండు, మూడు నెలల క్రితం పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో వృద్ధుడి వద్దకు వచ్చిన వ్యక్తి రూ.200 నోటుని ఇచ్చి వెళ్లి పోయాడు. కొన్ని రోజుల తరువాత మంజులాపూర్ కూరగాయల మార్కెట్‌లో నకిలీ నోట్లను అంటగట్టే క్రమంలో వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించడంతో కేసు నమోదు చేశారు.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లేటప్పుడు ఇండ్లలో విలువైన బంగారం, వెండి ఆభరణాలు నగదును ఉంచి వెళ్లకండి. చాలా వరకు దొంగలు వీటి కోసమే దొంగతనాలకు పాల్పడుతున్నారు. అలాగని ప్రయాణం చేసేటప్పుడు వెంట తీసుకుపోవద్దు. వాటిని లాకర్లలో దాచుకోవాలి. లాకర్ సదుపాయం లేని వాళ్లు దొంగలు ఊహించని ప్రదేశాల్లో దాచుకోవాలి.
- ఊరుకు వెళ్లేటప్పుడు మీ వివరాలు, మీరు ఉంటున్న ప్రాంతాలపై పోలీసులకు సమాచారం అందించండి.
- ఇంటిని అద్దెకు ఇచ్చేటప్పుడు వారి పూర్తి వివరాలు, ఆధార్ కార్డుతో పరీక్షించుకోండి.
- ఇంటికి ప్రధాన ద్వారం వద్ద ఉన్న కిటికీలను తప్పని సరిగా మూసివేయాలి. ● దూర ప్రయాణాలు చేసేటప్పుడు మీ సామగ్రిపై నిఘా ఉంచండి.

### దొంగతనాల కట్టడికి స్పెషల్ టీం

*దొంగతనాల నివారణకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశాం. ప్రతీ టీంలో ఎస్సై స్థాయి అధికారితోపాటు నలుగురు కానిస్టేబుల్స్ విధులు నిర్వహిస్తారు. పూర్తిగా దొంగతనాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం. పట్టణం, నగరం, గ్రామాలు, వార్డుల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల వివరాలను పోలీసులకు తెలిపితే మీ ప్రాంతంలో దొంగతనాలు జరుగకుండా పోలీసులు చర్యలు తీసుకుంటారు.*

**- జానకి షర్మిల, ఎస్పీ, నిర్మల్.**



# తెలంగాణకు కేసీఆరే శ్రీరామ రక్ష

- బీఆర్ఎస్ పార్టీలో చేరిన గాంధీనగర్ గ్రామం ● కండువా కప్పి ఆహ్వానించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ, ఏప్రిల్ 29 : 'కేసీఆర్ సభ చూశాక ప్రజలకు నమ్మకం పెరిగింది.. బీఆర్ఎస్ పార్టీనే తెలంగాణకు శ్రీరామరక్ష అని నమ్ముతున్నరు.' అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గాంధీనగర్ గ్రామస్తులు మంగళవారం మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో గ్రామమంతా ఏకమై బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను లోబడి మోసపోయామని తెలిపారు. కేసీఆర్ ఒక్క పిలుపుతో లక్షలాదిగా తరలివచ్చిన ఆ జనాన్ని చూసి మళ్లీ కేసీఆరే సీఎం అవుతారనే నమ్మకం ఉందన్నారు. సభకు ప్రజలను ఎక్కువ మొత్తంలో తరలించడంలో కార్యకర్తలకు జోష్ నింపడంలో కీలక పాత్ర పోషించిన మా ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను చూసి అభిమానంతో పార్టీలో చేరామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ప్రీతంరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల్ గౌడ్, మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాండురంగ్, ఇచ్చోడ మాజీ ఉప సర్పంచ్ శిరీష్‌రెడ్డి, దీపక్, పోచాలు, సురేందర్‌రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, అనిల్, రమేశ్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



కాంగ్రెస్ సమావేశంలో నాయకులను నిలదీస్తున్న సత్యనారాయణ

# కాంగ్రెస్ సమావేశం రసాభాస

### ఎస్సీలను స్టేజీ పైకి రానీవ్వలేదని వాగ్వాదం

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 29 : నిర్మల్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ సమావేశం రసాభాసగా మారింది. వేదిక పైకి ఎస్సీ నాయకులను ఆహ్వానించలేదని ముడుసు సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీశారు. దీంతో ఈ విషయాన్ని రాద్ధాంతం చేయవద్దని స్థానిక, రాష్ట్ర నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదైనా ఉంటే నాయకత్వానికి చెప్పుకోవాలని హితువు పలికారు. వేదికపై కూడా ఎస్సీ నాయకులు ఉన్నారని, వారి పేర్లు చదివి వినిపించడంతో వివాదం సద్దుమణిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర పరిశీలకుడు చంద్రశేఖర్ గౌడ్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, నారాయణరావు పటేల్, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు ఉన్నారు.

# పారదర్శకంగా నిర్వహించాం

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

ఎదులాపురం, ఏప్రిల్ 29 : గతంలో రెన్యువల్ కానీ మూడు బార్ షాపుల కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు కేటాయింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రెన్యువల్ చేసుకోని మూడు షాపులకు గతంలో దరఖాస్తులు స్వీకరించారు. దీనికి 61 దరఖాస్తులు రాగా.. మంగళవారం మూతబడిన బార్ల స్థానంలో బార్ల ఏర్పాటుకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియకు లక్కీ డ్రా నిర్వహించారు. అభ్యర్థుల సమక్షంలోనే టోకెన్లను పరిశీలించి కలెక్టర్ డ్రా తీసి ఎంపికైన వారికి పత్రాలను అందించారు. ఎక్సైజ్ అధికారిణి హిమశ్రీ, సీఐ రెండ్లే విజేందర్ పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికుడి మృతి

తాంసి, ఏప్రిల్ 29 : ఈదుల్లా సవర్గాం గ్రామంలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ఐరన్ లాడర్ పడి గ్రామపంచాయతీ కార్మికుడు ప్రభాకర్(45) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు పోలీసుల తెలిపిన వివరాలు ప్రకారం.. ఈనెల 17న గ్రామంలో ప్రభాకర్ విద్యుత్ మరమ్మతులు చేస్తున్న సమయంలో ఐరన్ లాడర్ పడి గాయాల పాలయ్యారు. గమనించిన స్థానికులు రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ప్రభాకర్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు.

### ఆందోళన చేసిన నాయకుల అరెస్టు

ఈదుల్లా సవర్గాంకు చెందిన మల్టీపర్పస్ వర్కర్ ప్రభాకర్ విధులు నిర్వహిస్తూ మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు డీపీవో కార్యాలయం ఎదుట మృతదేహంతో ధర్నా చేపట్టారు. ప్రభాకర్ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆందోళన విరమించాలని పోలీసులు చెప్పినా వినకపోవడంతో వారిని అరెస్టు చేశారు. అనంతరం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

కార్మికుని మృతదేహంతో ధర్నా చేస్తున్న నాయకులు





ప్రభాకర్ (ఫైల్)




ఇస్లాంనగర్ నుంచి దరఖాస్తు చేసుకున్న ఇతర రాష్ట్రాల యువకుల జాబితా

# బోగస్ సర్టిఫికెట్లతో ఆర్మీ ఉద్యోగాలు

- ఆదిలాబాద్ జిల్లావాసులుగా ధ్రువీకరణ పత్రాలు
- నకిలీ సర్టిఫికెట్లు పొందిన ఇతర రాష్ట్ర యువకులు ● ఇచ్చోడలో ముగ్గురిపై కేసు

ఇచ్చోడ, ఏప్రిల్ 29 : ఇతర రాష్ట్రాలకు చెందిన యువకులు ఆదిలాబాద్ జిల్లావాసులుగా తప్పుడు నివాస ధ్రువీకరణ పత్రాలు సృష్టించి బీఎస్ఎఫ్‌లో ఉద్యోగాలు పొందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉద్యోగం పొందిన ముగ్గురిపై ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌బీ, రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేశారు. ఆ వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ఇస్లాంనగర్ గ్రామం నుంచి 14 మంది, కొకస్ మన్నూర్ గ్రామం నుంచి ఒక్కరు, సిరికొండ మండలంలోని పొన్న నుంచి ఒక్కరు చొప్పున నకిలీ నివాస ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఆర్మీలో ఉద్యోగాలు సాధించారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి ఉద్యోగాలు పొందగా.. ఎంపికైన వారి సర్టిఫికెట్ల విచారణ కోసం గ్రామాల్లోకి వచ్చారు. తమ గ్రామాల నుంచి ఎవరు ఆర్మీకి ఎంపిక కాలేదని గ్రామస్తులు తెలుపడంతో వ్యవహారం బయటపడింది. ఒక్క ఇస్లాంనగర్ గ్రామం నుంచి సూరజ్ సహాని, బిపిన్ యాదవ్, అతుల్ కుమార్ యాదవ్, రాజ్ కుమార్ పాటిల్, అంకిత్ పటేల్, దీపక్ కుమార్ పటేల్, జైనూల్ అభిదునఖన్, మిరాజ్ అన్సారీ, అసద్ ఖాన్, వినయ్ వర్మ, నాగేంద్ర యాదవ్, అబిద్ ఖాన్, శుభాం దుబే, కుల్దీప్ తివారీలు నకిలీ ధ్రువీకరణ పత్రాలు పొంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరి నివాస ధ్రువీకరణ కోసం పోలీసులు రెవెన్యూ కార్యాలయంలో ఎంక్వైరీ చేయగా నకిలీ ధ్రువీకరణాలుగా నిర్ధారణ అయింది. కొకస్ మన్నూర్ నుంచి సందీప్ కుమార్, పొన్నా నుంచి రోహిత్ బాబులు నకిలీ ధ్రువీకరణ పత్రాలు పొంది ఆర్మీ ఉద్యోగాలకు ఎంపిక కాగా.. ఎస్‌బీ పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారం వెనుక మండల కేంద్రంలోని ఒక మీ సేవా సెంటర్ నుంచి మొత్తం వ్యవహారం నడిచినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. ఇస్లాంనగర్‌కు చెందిన సహాని సూరజ్, కొకస్ మన్నూర్ గ్రామానికి చెందిన గజేందర్, దుగ్విజయ్ విసుకర్మలు ఫోర్జరీ సతకం చేసినట్లు ఎస్‌బీ ఎక్వయిరీలో తెలడంతో రెవెన్యూ, ఎస్‌బీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.



కామారెడ్డి, ఇస్లాంనగర్‌లో తీసుకున్న సర్టిఫికెట్లపై ఉన్న ఒకే నంబర్